ప్రభుత్వ స్థలాలపై స్థానిక నేతల కన్ను

- వినాయకనగర్ బస్తీలో చెలరేగుతున్న కబ్జాదారులు
- అక్రమార్కుల చెరలో వందలాది గజాలు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): రాజకీయ అండ చూసుకొని బస్తీ నేతలు చెలరేగిపోతున్నారు. ఈ క్రమంలో కొందరు కబ్జాలపర్వానికి తెరలేపుతున్నారు. ఖైరతాబాద్ నియోజక వర్గంలోని జూబ్లీహిల్స్ డివిజన్‌లో ఈ కబ్జాల పంచాయితీ ఇప్పుడు తారాస్థాయికి చేరుకుంది. ఫిలింనగర్ వినాయకనగర్ బస్తీలోని పర్వతాంజనేయస్వామి ఆలయ పరిసరాల్లోని స్థలాలు అన్యాక్రాంతమవుతున్నాయని, కొంతమంది నేతలు కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని పలువురు బస్తీవాసులు ఇప్పటికే పలుమార్లు మండల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. గతంలో పర్వతాంజనేయస్వామి ఆలయానికి వెళ్లాలంటే వినాయకనగర్ బస్తీలో ఉన్న మెట్ల దారి నుంచి మాత్రమే మార్గం ఉండేది. కానీ కొన్ని నెలల క్రితం బస్తీకి దీన్‌దయాళ్‌నగర్ బస్తీ వైపు నుంచి దారి కావాలని స్థానికులు ప్రజా ప్రతినిధులు, అధికారుల సహకారంతో దారిని ఏర్పాటు చేసుకున్నారు. దీన్‌దయాళ్ బస్తీ వైపు నుంచి రోడ్డు ఏర్పాటైన తర్వాత కబ్జాదారుల కన్ను వినాయకనగర్ బస్తీ వైపు నుంచి వచ్చేదారిపై పడింది. అక్కడ ఉన్న సుమారు 200ల గజాల ప్రభుత్వ స్థలాన్ని చిన్న ప్లాట్లుగా చేసి అమ్మేయాలని స్థానిక నేతలు భావించారని బస్తీలో ఆరోపణలు వినిపించాయి. దీన్ని నిజం చేసేలా వినాయకనగర్ బస్తీ వైపు మెట్ల మార్గం వద్ద కాకుండా కొంత దూరంలో గుడి చుట్టూ ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టారు. అది కూడా జీహెచ్ఎంసీ కడుతున్నట్లు కలరింగ్ ఇచ్చారు. తీరా వివాదం తీవ్రం కావడంతో మండల అధికారులు ఇక్కడ పర్యటించారు. తహసీల్దార్ పర్యటన తర్వాత ప్రహరీ పనులు నిలిచిపోయాయి. మరోవైపు పర్వతాంజనేయస్వామి ఆలయం వైపు దారి ఏర్పాటైన తర్వాత కింది వైపు నుంచి పైకి నడిచేందుకు ఏర్పాటు చేసిన దారిలో కొందరు నాయకులు బండరాళ్లు వేసి మూసివేయించారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ వెంటనే రాళ్లు తొలగించాలని.. లేదంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించడంతో వాటిని తొలగించారు. అయితే అక్కడ వాహనాలను అడ్డు పెడుతూ ఎవరినీ అటు వైపు వెళ్లనీయట్లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులు సంయుక్తంగా ఇక్కడ పర్యటించి స్థలాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని బస్తీవాసులు కోరుతున్నారు.


ప్రభుత్వ స్థలంలో అక్రమంగా వేసిన రేకుల షెడ్డు

ప్రజావాణిలో ఫిర్యాదులు

దీన్‌దయాళ్‌నగర్ బస్తీని ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలంలో గతంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించాలని గతంలో ఎమ్మెల్యే దానం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రజావాణిలో భాగంగా జిల్లా కలెక్టర్‌కు ఈ బస్తీలో జరుగుతున్న కబ్జాలపై ఫిర్యాదులు అందాయి. ఇద్దరు వ్యక్తులు చెరో వంద గజాల స్థలాన్ని కబ్జా చేసి ఆ స్థలంలో ఇళ్లు నిర్మించుకున్నారని, నకిలీ ఇంటి నంబర్లతో రిజిస్ట్రేషన్ సైతం చేయించుకున్నారని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.


వినాయకనగర్ బస్తీలో కబ్జా చేసేందుకు యత్నిస్తున్న స్థలం

కబ్జా చేసి విక్రయాలు

బస్తీకి చెందిన ఓ నాయకుడు ప్రభుత్వానికి చెందిన 100 గజాల స్థలాన్ని కబ్జా చేశాడు. దాన్ని మీ సేవా కేంద్రంలో పనిచేసే ఓ వ్యక్తికి అమ్మేశాడు. ఈ ప్రక్రియలో సుమారు రూ.25 నుంచి 30 లక్షల రూపాయలు చేతులు మారాయని బస్తీలో ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మొదట్లో షెడ్డు నిర్మించే సమయంలో రెవెన్యూ సిబ్బంది అడ్డుకొని కూల్చివేశారు. అయితే తాజాగా సిబ్బంది సైతం చూసీచూడనట్టు వ్యవహరించడం పట్ల అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. తాజాగా దీనికి ఎదురుగా ఉన్న మరో 300 గజాల స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారు. క్రమంగా బస్తీలోని ప్రభుత్వ స్థలాలన్నీ కబ్జాకు గురవుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకుంటున్నాం

వినాయకనగర్ బస్తీలో కబ్జాల గురించి ఫిర్యాదు అందిన వెంటనే విచారణ చేపడుతున్నాం. ఆక్రమణ వాస్తవమని తెలగానే కూల్చివేతలు చేపట్టడంతో కబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నాం. బస్తీలో 100 గజాల స్థలంలో ఏర్పాటు చేసిన రేకుల షెడ్డును గతంలో రెండు సార్లు కూల్చివేశాం. కేసులు నమోదు చేశాం. మళ్లీ కబ్జా జరిగి ఉంటే మరోసారి చర్యలు తీసుకుంటాం. మండల పరిధిలో ఉన్న ప్రభుత్వ స్థలాల రక్షణ కోసం ప్రత్యేక బృందంతో ఎప్పటికప్పుడు తనిఖీలు చేపడుతున్నాం.

- అనితారెడ్డి, షేక్‌పేట తహసీల్దార్


సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ విజయ్‌కుమార్

హాస్టళ్ల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

- డీసీపీ విజయ్‌కుమార్

అమీర్‌పేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): హాస్టళ్ల నిర్వాహకులు నిబంధనలు పాటించడంతో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పశ్చిమ మండల డీసీపీ విజయ్‌కుమార్ సూచించారు. సోమవారం డీసీపీ కార్యాలయంలో ఏసీపీ వెంకటరమణ, ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డితో కలిసి ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని 127 మహిళా హాస్టళ్ల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హాస్టళ్లలో ఉండే మహిళల భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ప్రధానంగా సెక్యూరిటీ గార్డును నియమించుకోవడంతో పాటు వెలుతురు ఉండే విధంగా లైట్లు, హాస్టల్‌కు వచ్చే వారి కోసం రిజిస్టర్ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. వంట మనుషుల పూర్తి వివరాలు సేకరించాకే పనిలో పెట్టుకోవాలన్నారు. హాస్టళ్లలో ఎలాంటి అసాంఘీక కార్యకలాపాలు, గొడవలు, కొట్లాటలు జరిగినా, గుర్తు తెలియని వ్యక్తులు కనిపించినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. నిబంధనలు పాటించని హాస్టల్ నిర్వాహకు పై నెగ్లిజెంట్ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఐ గోపాల్, డీఎస్ఐ సూరజ్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ మీడియేటర్ వాలంటీర్‌గా రఘునాథ్

బేగంపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిటీ మీడియేటర్ వాలంటీర్‌గా బేగంపేటకు చెందిన రఘునాథ్‌ను తెలంగాణ స్టేట్ లీగల్ సెల్ అథారిటీ ఇటీవల నియమించింది. ఈ క్రమంలో సోమవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును రఘునాథ్ కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ.. పేద,మధ్యతరగతి ప్రజల కేసులను మధ్య వర్తిగా ఉండి పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు.


రఘునాథ్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

నల్గొండ టోర్నమెంట్‌కు విద్యుత్ సౌధ హాకీ జట్టు

ఎర్రగడ్డ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): నల్గొండలో నేటి నుంచి జరగనున్న రాష్ట్రస్థాయి హాకీ టోర్నమెంట్‌కు వెళ్తున్న విద్యుత్ సౌధ జట్టుకు కళ్యాణ్ శ్రీనివాస్‌రెడ్డి నాయకత్వం వహిస్తారని తెలంగాణ ట్రాన్స్‌కో డిస్కమ్స్ స్పోర్ట్స్ కౌన్సిల్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కళ్లెం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. నల్గొండలో ఈ నెల 18వ తేదీ నుంచి 20 వరకు రాష్ట్రస్థాయి హాకీ టోర్నమెంట్ జరుగుతుందన్నారు. తనకు నాయకత్వ బాధ్యతలు అప్పగించడం పట్ల సంతోషంగా ఉందన్నారు. ఎన్నో టోర్నమెంట్లను విజయవంతంగా ముందుకు తీసుకెళ్లడంలో ప్రధాన భూమిక పోషించడంతోనే తనకు బాధ్యతలు అప్పగించారన్నారు. మేనేజర్‌గా వ్యవహరించనున్న ఆనంద్‌కుమార్ సహకారంతో తప్పకుండా విజయం సాధిస్తామని ఆయన పేర్కొన్నారు.

ఆగి ఉన్న కారు, బైక్‌ను ఢీకొట్టిన కారు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న కారు, ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. టోలిచౌకికి చెందిన ఖాజా రఫియుద్దీన్ ఈ నెల 15న తన కారులో జూబ్లీహిల్స్ రోడ్ 1 కు వచ్చాడు. ద్విచక్ర వాహనంపై వచ్చిన స్నేహితులతో మాట్లాడుతుండగా మాదాపూర్ వైపు నుంచి వేగంగా వస్తున్న టాటా నెక్సాన్ కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు, ద్విచక్ర వాహనం ధ్వంసమయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. కారులో ఉన్న క్రిష్ అగర్వాల్, నితీష్ అగర్వాల్‌తో పాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకుని శ్వాస పరీక్ష చేయగా వారు మద్యం తాగినట్లు నిర్ధారణ అయింది.


ప్రమాదానికి కారణమైన కారు

ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై దాడిచేసిన వ్యక్తుల అరెస్ట్

బంజారాహిల్స్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై దాడి చేసి అతని మెడలో ఉన్న బంగారు గొలుసు, నగదు అపహరించిన వారిపై కేసు నమోదైంది. బోరబండకు చెందిన జి.ప్రసాద్ జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 16న ఆయన ఇందిరానగర్‌లోని ఓ బార్‌కు వెళ్లాడు. అక్కడ ఇద్దరు యువకులు అతనితో వాగ్వాదానికి దిగారు. కొద్దిసేపటికి ప్రసాద్ బయటకు రాగా వాగ్వావాదానికి దిగిన ఇద్దరితో పాటు మరో ఐదుగురు ప్రసాద్‌పై దాడిచేసి గాయపర్చారు. అతని మెడలో ఉన్న బంగారు గొలుసు, రూ.1200 నగదు తీసుకుని పోలీసు సైరన్ వినిపించడంతో అక్కడి నుంచి పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దాడికి పాల్పడిన తన్నల సాయికుమార్, ఎడిగె ప్రణీత్ గౌడ్, నందిపాటి నవీన్, బండి సత్యకిరణ్, శ్రీనివాస్‌లను అరెస్టు చేశారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు.

హోటల్ వ్యాపారం పేరుతో మోసం

బంజారాహిల్స్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): హోటల్ వ్యాపారంలో పెట్టుబడి పేరిట ఓ యువకుడి వద్ద డబ్బు తీసుకొని మోసం చేసిన కానిస్టేబుల్‌పై కేసు నమోదైంది. అల్విన్ కాలనీకి చెందిన ఆరేటి జ్ఞానసాయి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. గతేడాది తన స్నేహితులతో కలిసి ఓ కేఫ్‌లో ఉన్నాడు. ఆ సమయంలో ఓ వ్యక్తి జ్ఞానసాయి వద్దకు వచ్చి తన పేరు హరిజన గోవర్ధన్ అని.. టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నట్లు చెప్పాడు. తనకు వ్యాపారవేత్తలతో పరిచయం ఉందని చెప్పడంతో జ్ఞానసాయి అతని ఫోన్ నంబర్ తీసుకున్నాడు. కొద్ది రోజుల తరువాత కూకట్‌పల్లిలో హోటల్ వ్యాపారం ఉందని, రూ.ఐదు లక్షల పెట్టుబడి పెడితే మంచి లాభాలు వస్తాయని కానిస్టేబుల్ చెప్పాడు. ఈ మేరకు బంజారాహిల్స్ ఐసీసీ వద్ద పలు దఫాలుగా రూ.2,82,725 తీసుకున్నాడు. ఆ తరువాత నుంచి ముఖం చాటేసాడు. ఫోన్ చేసినా స్పందించలేదు. మోసపోయినట్టు గ్రహించిన బాధితుడు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగం పేరుతో రూ.1.39 లక్షలు కాజేశారు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో ఇంటర్వ్యూ చేసి ఉద్యోగం వచ్చిందని నమ్మించిన సైబర్ నేరగాళ్లు నగరానికి చెందిన యువకుడి నుంచి రూ.1.39 లక్షలు కాజేశారు. సికింద్రాబాద్‌కు చెందిన ప్రైవేటు ఉద్యోగి (28) 'ఎడ్యుబ్రిడ్జి' సంస్థలో 'ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్' కోర్సును ఆన్‌లైన్‌లో పూర్తి చేశాడు. కోర్సు పూర్తిచేసుకున్న కొద్ది రోజులకు సైబర్ నేరగాడు ఫోన్‌చేశాడు. తాను 'ఏటీఓఎస్' సంస్థ బెంగళూరు హెచ్ఆర్ మేనేజర్‌నని పరిచయం చేసుకున్నాడు. తమ సంస్థలో సీనియర్ అసోసియేట్ పోస్టు ఖాళీగా ఉందని.. ఆసక్తి ఉంటే ఇంటర్వ్యూకు హాజరవ్వాలని సూచించాడు. బాధితుడు అంగీకరించడంతో ఫోన్‌లోనే ఇంటర్వ్యూ చేసి సీనియర్ అసోసియేట్ ఉద్యోగానికి ఎంపికైనట్లు చెప్పాడు. ఆన్‌లైన్‌లో శిక్షణ ఉంటుందని, ఆఫర్ లెటర్ తీసుకుంటే తప్పనిసరిగా జాయిన్ కావాలని, అందుకోసం కొంత మొత్తం సెక్యూరిటీ డిపాజిట్ కట్టాలని షరతు పెట్టాడు. మెయిల్ నుంచి ఆఫర్ లెటర్ పంపించి పలు దఫాలుగా రూ1,39,584 జమ చేయించుకున్నాడు. ఉద్యోగంలో చేరిన 15 రోజుల్లో డబ్బు ఖాతాలో జమ చేస్తారని నమ్మించాడు. జాయినింగ్ తేదీని తరచూ మార్చడం, మళ్లీ డబ్బులు డిమాండ్ చేయడంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు నగర సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఉద్యోగం పేరుతో ఎవరైనా డబ్బులు అడిగితే అది మోసమని గుర్తించాలని, ఎట్టి పరిస్థితుల్లో డబ్బులు పంపకూడదని సైబర్ క్రైం అధికారులు సూచించారు.


నందినగర్ హనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ కవిత, కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి


కేక్ కట్‌చేస్తున్న కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ తదితరులు

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 14లోని హనుమాన్ దేవాలయంలో వెంకటేశ్వరనగర్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ కవిత పాల్గొన్నారు. బీఆర్ఎస్ నాయకులు మన్నె గోవర్ధన్‌రెడ్డి, విప్లవ్, రాంచందర్ తదితరులు హాజరయ్యారు. ఫిలింనగర్‌లోని సాయిబాబా దేవాలయంలో కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఫిలింనగర్ భారీ కేక్‌ను కట్ చేశారు.

బోరబండలో..

బోరబండ, ఫిబ్రవరి 17 ఆంధ్రజ్యోతి: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను బోరబండ డివిజన్ బీఆర్ఎస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పవనం శివశంకర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎస్సార్టీనగర్‌లో నిర్వహించిన ఈ వేడుకల్లో బీఆర్ఎస్ నాయకులు మధు, రాము, శివ, రంజిత్, నారాయణరెడ్డి, రమేష్, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ నివేదికలో లోపాలు

- డోర్ కులానికి అన్యాయం జరిగింది
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ

పంజాగుట్ట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏక సభ్య కమిషన్ విచారణ శాస్త్రీయంగా జరగలేదని, లోపాలు సరిదిద్దుకోవడానికి కమిషన్‌కు మరో పది రోజులు గడువు ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ సూచించారు. లోపాలతో కూడిన నివేదికను అసెంబ్లీలో ఆమోదించారని విమర్శించారు. వీరశైవ కక్కయ్య డోర్ సమాజ్ ఆధ్వర్యంలో సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగలు, డోర్ కులం వేర్వేరు అయినా తమ కులవృత్తి ఒక్కటేనని, అత్యంత వెనుకబడిన డోర్ కులాన్ని గ్రూపు-2లో తమతో కలపకుండా అభివృద్ధి చెందిన కులాలు ఉన్న గ్రూపు-3లో కలపడం దారుణమన్నారు. జస్టిస్ షమీమ్ అక్తర్ ఇచ్చిన నివేదికలోని అంశాలను సబ్ కమిటీ అధ్యయనం చేసిందా లేదా అని ఆయన ప్రశ్నించారు. ఈ నివేదికతో కొన్ని కులాలకు అన్యాయం జరుగుతోందన్నారు. ఈ నెల 7న తాము తలపెట్టిన లక్ష డప్పులు, వేల గొంతులు కార్యక్రమాన్ని అడ్డుకోవడానికే రాష్ట్ర ప్రభుత్వం అశాస్త్రీయంగా జరిగిన వర్గీకరణను అసెంబ్లీలో ఆమోదించిందని ఆరోపించారు. దళితులలో ఏ కులాన్ని ఏ గ్రూపులో చేర్చాలి, ఏ కులానికి ఎంత శాతం రిజర్వేషన్ కేటాయించాలనే విషయంలో కమిషన్ విచారణ శాస్త్రీయంగా జరగలేదని విమర్శించారు. పొరపాట్లను సరి చేయడానికి కమిషన్‌కు మరో పది రోజుల సమయం ఇవ్వాలని, ఆయన నివేదిక ఇచ్చిన తరువాత ఎస్సీ వర్గీకరణ సబ్ కమిటీ 48 గంటలు అధ్యయనం చేసి లోపాలు ఏమైనా ఉంటే సరి చేసి క్యాబినెట్‌కు పంపించాలని సూచించారు. వెనుకబడిన వారిని దోచుకోవడానికి అభివృద్ధి చెందిన కులాలను గ్రూపు-1లో చేర్చారన్నారు. ఈ ఈ సమావేశంలో మాజీ ఎంపీ వెంకటేష్ నేత, వీరశైవ కక్కయ్య డోర్ సమాజ్ అధ్యక్షుడు దత్తు, నాయకులు ఉమేష్, వినోద్ చోగ్లె, ముకేశ్, రాజు, నర్సింగ్ గైక్వాడ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో అభివాదం చేస్తున్న మంద కృష్ణమాదిగ, వీరశైవ కక్కయ్య డోర్ సమాజ్ ప్రతినిధులు

'నుమాయిష్' ఆదాయంతో విద్యావ్యాప్తి

- ముగింపు ఉత్సవాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్

అఫ్జల్‌గంజ్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఏటా అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన (నుమాయిష్) ద్వారా వస్తున్న ఆదాయాన్ని వెనకబడిన తెలంగాణ ప్రాంతాల్లో విద్యాసంస్థలు నెలకొల్పి, విద్యావ్యాప్తికి కృషి చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఎగ్జిబిషన్ సొసైటీ చేస్తున్న కృషిని కొనియాడారు. సోమవారం రాత్రి నాంపల్లిలోని ఎగ్జిబిషన్ మైదానంలో గాంధీ సెంటనరీ హాల్ వేదికగా 84వ అఖిలభారత పారిశ్రామిక ప్రదర్శన-2025 నుమాయిష్ ముగింపు ఉత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 46 రోజుల పాటు నిరవధికంగా నుమాయిష్ ఎలాంటి ఇబ్బందులు, అవరోధాలు లేకుండా ప్రశాంతంగా ముగిసిందన్నారు. అందుకు కృషి చేసిన సొసైటీ వర్గాలను ప్రత్యేకంగా అభినందించారు. యేటా నిర్వహణ ద్వారా వచ్చే ఆదాయాన్ని సామాజిక సేవా కార్యక్రమం కింద విద్యాసంస్థలు స్థాపించి విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేస్తున్నారన్నారు. ఇక ప్రభుత్వపరంగా సహకరిస్తామని భరోసా ఇచ్చారు. దేశ, విదేశాల్లో మున్ముందు మరింత ఆదరణ పొందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈసారి దేశ, విదేశాల నుంచి లక్షల మంది సందర్శకులు వచ్చారన్నారు. అనంతరం ఉత్తమ స్టాళ్ల యజమానులు, అధికారులు, ఇతరులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు ఎం. అనిల్‌కుమార్ యాదవ్, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ శివసేనారెడ్డి, తెలంగాణ మైనారిటీస్ గురుకులాల విద్యాసంస్థల సొసైటీ చైర్మన్ ఫయిమ్ ఖురేషి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతినిధులు నిరంజన్, సురేందర్ రెడ్డి, డి.మోహన్, ప్రభాశంకర్, రవీయాదవ్ తదితరులు పాల్గొన్నారు.




జ్ఞాపికను అందజేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

నాటుసారాను అడ్డుకునేందుకు స్పెషల్ డ్రైవ్

- రాష్ట్ర వ్యాప్తంగా 1,771 కేసులు నమోదు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): నాటుసారా తయారీని అడ్డుకునేందుకు ఎక్సైజ్ పోలీసులు చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లో నెల రోజుల్లో 1771 కేసులు నమోదు చేశారని, స్పెషల్ డ్రైవ్‌తో మంచి ఫలితాలు వచ్చాయని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి పేర్కొన్నారు. కమలాసన్‌రెడ్డి ఆదేశాల మేరకు 13 జిల్లాల్లోని 25 ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో అధికారులు, సిబ్బంది ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. జనవరి 16 నుంచి ఫిబ్రవరి 15 వరకు 1720 మందిపై 1771 కేసులు నమోదు చేసి, 295 వాహనాలు, 21,148 కిలోల బెల్లం, 8,718 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకోవడంతో పాటు 1,10,660 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. రూ.14.99 లక్షల జరిమానాలు విధించారు. నాటుసారాను అరికట్టేందుకు ప్రజలు సహకారం అందించాలని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి కోరారు.


కమలాసన్‌రెడ్డి

పంబాల కులంపై రాజలింగం వ్యాఖ్యలు సరికాదు

- కొండూరి రవి

పంజాగుట్ట, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): పంబాల కులంలో కొంతమంది అభివృద్ధి చెందితే అందరూ అభివృద్ధి చెందినట్లు కాదని, తమ కులంపై ఎస్సీ 57 ఉప కులాల ఐక్య వేదిక అధ్యక్షుడు చింతల రాజలింగం వ్యాఖ్యలు సరికాదని వేదిక కోశాధికారి, పంబాల కుల వృత్తి కళాకారుల సంఘం ప్రచార కార్యదర్శి కొండూరి రవి అన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం నాయకులతో కలిసి ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ గ్రూపు-1లో అత్యంత వెనుకబడిన పంబాల కులాన్ని చేర్చడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. 70 సంవత్సరాల తర్వాత తమ ఉనికిని కాపాడుకునే అవకాశం వచ్చిందన్నారు. ఎస్సీ 57 ఉపకులాలకు న్యాయం చేయాలని చింతల రాజలింగంతో పాటు తాము కూడా కలిసి పోరాటం చేశామని, ఎన్నో వేదికలపై ఆయన పక్కనే కూర్చుని మాట్లాడినట్లు తెలిపారు. ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి కుటుంబం అభివృద్ధి చెందితే తమ కులం మొత్తం అభివృద్ధి చెందినట్టు కాదన్నారు. గతంలో పలు సందర్భాల్లో మంద కృష్ణమాదిగపై విమర్శలు చేశారని, ప్రస్తుతం ఆయన దేవుడని కొనియాడుతున్నారని విమర్శించారు. తమను గ్రూపు-1 నుంచి తొలగించాలని చెప్పడానికి చింతల రాజలింగం ఎవరని ప్రశ్నించారు. ఎస్సీ ఉపకులాల ఐక్య వేదిక కోశాధికారి పదవికి రాజీనామా చేస్తున్నట్టు ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు.



విశ్వవిద్యాలయం ఉపకులపతి అప్పారావును సన్మానిస్తున్న మోహన్‌నాయుడు

ఎస్వీయూను సందర్శించిన మోహన్‌నాయుడు

అమీర్‌పేట, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): బోధన, పరిశోధన, ఉపాధి రంగాల్లో శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం దినదిన ప్రగతి సాధిస్తోందని స్పెక్ట్రమ్ పబ్లికేషన్స్ అధినేత సూరినేని మోహన్ నాయుడు అన్నారు. జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన స్పెక్ట్రమ్ పబ్లికేషన్స్ అధినేత మోహన్ నాయుడు సోమవారం తిరుపతిలోని ఎస్వీయూను సందర్శించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య అప్పారావును, రిజిస్ట్రార్ భూపతి నాయుడులను సన్మానించి మాట్లాడారు. తాను కూడా ఈ విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలలోనే విద్యాభ్యాసం చేశానన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విద్యా విధానం(ఎన్ఈపీ)కి అనుగుంగా బోధన, పరిశోధన రంగాలు అభివృద్ధి చెందడం ప్రశంసనీయమన్నారు. దూరవిద్య విభాగానికి పూర్వ వైభవం తీసుకురావడంలో తమ స్పెక్ట్రమ్ గ్రూప్ కృషి చేస్తుందన్నారు. విశ్వవిద్యాలయం ఉపకులపతి అప్పారావు మాట్లాడుతూ.. రచన, ప్రచురణ రంగంలో స్పెక్ట్రమ్ గ్రూప్ రెండు తెలుగు రాష్ట్రాల్లో విశేష గుర్తింపును కైవసం చేసుకుందన్నారు. దూరవిద్య విభాగం పురోభివృద్ధిలో భాగంగా విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను మోహన్ నాయుడు ఆధ్వర్యంలో సకాలంలో అందించడం అభినందనీయమన్నారు.

ముగిసిన జనార్దన్‌రావు హత్య కేసు నిందితుడి కస్టడీ

పంజాగుట్ట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పారిశ్రామికవేత్త వెలమాటి చంద్రశేఖర జనార్దన్‌రావును దారుణంగా హత్య చేసిన ఘటనలో నిందితుడు కీర్తి తేజను పంజాగుట్ట పోలీసులు విచారణ నిమిత్తం ఈ నెల 13న న్యాయస్థానం అనుమతితో ఐదు రోజుల కస్టడీకి తీసుకున్నారు. కీర్తితేజను అధికారులు పలుమార్లు విచారించి ఆధారాలు సేకరించారు. విచారణలో భాగంగా మణికొండ ల్యాంకో హిల్స్‌లో ఉంటున్న తన నివాసంతో పాటు హతుడు చంద్రశేఖర జనార్దన్‌రావు ఇంటికి కూడా తీసుకెళ్లారు. హత్య ఘటనపై సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేశారు. నిందితుడి ఐదు రోజుల కస్టడీ గడువు ముగియడంతో పోలీసులు కీర్తి తేజను తిరిగి జైలుకు తరలించారు.



ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
ఎం.డి. రఫీక్ : 99854 00084, జి.అంజయ్య: 9985921364

గాంధీ ఆస్పత్రికి ఎలక్ట్రిక్ ఆటో వితరణ



ఆటోను అందజేసిన బ్యాంక్ ఆఫ్ బరోడా ప్రతినిధులు

అడ్డగుట్ట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): గాంధీ ఆస్పత్రిలో ఉచిత భోజనం సమకూర్చడానికి అవసరమైన మూడు చక్రాల ఎలక్ట్రిక్ ఆటోను జనహిత సేవా ట్రస్ట్‌కు బ్యాంక్ ఆఫ్ బరోడా అధికారులు అందజేశారు. బ్యాంక్ ఆఫ్ బరోడా జనరల్ మేనేజర్ రితేష్ కుమార్, హైదరాబాద్ జోన్ డీజీఎం సుధాకర్, మెట్రో రీజియన్ డీజీఎంకే అదిత్య సోమవారం జనహిత సేవా ట్రస్ట్ మేనేజర్ ట్రస్టీలు నర్సింహ, పాలపర్తి రమేష్‌లకు ఆటో తాళాలు అందజేశారు. దీంతో పాటు ఉచిత భోజనం కోసం రూ.55 వేల చెక్కును అందజేశారు.

సన్నిహిత హోమ్‌లో సిల్వర్ జూబ్లీ వేడుకలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఉషారాణి

రాంగోపాల్‌పేట్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పార్క్‌లేన్‌లోని సన్నిహిత హోమ్ సిల్వర్‌జూబ్లీ వార్షికోత్సవం హోమ్ ఆవరణలో సోమవారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి అతిథిగా హాజరైన శ్యామలరావు సన్నిహిత హోమ్ డైరెక్టర్ ఉషారాణితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. తుకారాంగే ట్, బొల్లారం, పార్క్‌లేన్‌లోని హోమ్ విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో పార్క్‌లేన్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి, క్రొనేస్ కంపెనీ అధినేత చందన్ తదితరులు పాల్గొన్నారు.

జీవితంలో టర్నింగ్ పాయింట్ 'టెన్త్'



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

రాంగోపాల్‌పేట్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): జీవితంలో నిలదొక్కుకోవడానికి పదో తరగతి పరీక్షలు టర్నింగ్ పాయింట్ అని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. సోమవారం నల్లగుట్టలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులతో పలు విషయాలపై ఆరా తీశారు. మధ్యాహ్నం భోజనం ఎలా ఉంది అని అడిగారు. అనంతరం ఆయన మాట్లాడారు. పరీక్షల భయం వీడి ప్రణాళికాబద్ధంగా చదవాలన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించాలని చెప్పారు. ఐదారేళ్ల ప్రశ్న పత్రాలను తీసుకుని ప్రాక్టీస్ చేయాలని సూచించారు. సమయాన్ని వృథా చేయకుండా చదువుపైనే దృష్టి సారించాలన్నారు. చదువులో వెనుకబడిన వారిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. క్రీడల కోసం గ్రౌండ్‌ను చదును చేయించాలని, పరిశుభ్రతగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ శ్రీధర్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ గుండప్ప, స్వరూప, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

● ప'రేషన్'..!



నూతన రేషన్ కార్డుల జారీ అనేది నిరంతర ప్రక్రియ అని ప్రభుత్వం చెబుతోంది. ఇప్పటికే లబ్ధిదారులు.. తమ కార్డుల్లో చేర్పులు మార్పులు ఈ సేవా కేంద్రాల్లో చేసుకోవచ్చని ప్రకటించింది. అయినా గానీ ప్రజలు మీ సేవా కార్యాలయాలకు క్యూ కడుతున్నారు. సోమవారం సర్దార్ పటేల్ రోడ్డులోని సికింద్రాబాద్ సర్కిల్ నెంబర్ 8 ఏఎస్ఓ కార్యాలయం వద్దకు ప్రజలు భారీగా తరలివచ్చారు. కాగా, కుటుంబ పెద్ద దరఖాస్తు చేసుకుంటే పని ఆధారంగా ఐదు రోజుల వరకు సమయం పట్టవచ్చని ఏఎస్ఓ కృష్ణవేణి తెలిపారు. దీంతో ప్రజలు శాంతించారు.

- రాంగోపాల్‌పేట్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి)

ఉద్యోగం పేరుతో రూ.1.39 లక్షలు కాజేశారు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో ఇంటర్వ్యూ చేసి ఉద్యోగం వచ్చిందని నమ్మించిన సైబర్ నేరగాళ్లు నగరానికి చెందిన యువకుడి నుంచి రూ.1.39 లక్షలు కాజేశారు. సికింద్రాబాద్‌కు చెందిన ప్రైవేటు ఉద్యోగి (28) 'ఎడ్యుబ్రిడ్జ్' సంస్థలో 'ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్' కోర్సును ఆన్‌లైన్‌లో పూర్తిచేశాడు. కోర్సు పూర్తిచేసుకున్న కొద్ది రోజులకు సైబర్ నేరగాడు ఫోన్ చేశాడు. తాను 'ఏటీఓఎస్' సంస్థ బెంగళూరు హెచ్‌ఆర్ మేనేజర్‌నని పరిచయం చేసుకున్నాడు. తమ సంస్థలో సీనియర్ అసోసియేట్ పోస్టు ఖాళీగా ఉందని.. ఆసక్తి ఉంటే ఇంటర్వ్యూకు హాజరవ్వాలని సూచించాడు. బాధితుడు అంగీకరించడంతో ఫోన్‌లోనే ఇంటర్వ్యూ చేసి సీనియర్ అసోసియేట్ ఉద్యోగానికి ఎంపికైనట్లు చెప్పాడు. ఆన్‌లైన్‌లో శిక్షణ ఉంటుందని, ఆఫర్ లెటర్ తీసుకుంటే తప్పనిసరిగా జాయిన్ కావాలని, అందుకోసం కొంత మొత్తం సెక్యూరిటీ డిపాజిట్ కట్టాలని షరతు పెట్టాడు. మెయిల్ నుంచి ఆఫర్ లెటర్ పంపించి పలు దఫాలుగా రూ1,39,584 జమ చేయించుకున్నాడు. ఉద్యోగంలో చేరిన 15 రోజుల్లో డబ్బు ఖాతాలో జమ చేస్తారని నమ్మించాడు. జాయినింగ్ తేదీని తరచూ మార్చడం, మళ్లీ డబ్బులు డిమాండ్ చేయడంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు నగర సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఉద్యోగం పేరుతో ఎవరైనా డబ్బులు అడిగితే అది మోసమని గుర్తించాలని, ఎట్టి పరిస్థితుల్లో డబ్బులు పంపకూడదని సైబర్ క్రైం అధికారులు సూచించారు.

ఎస్సీ వర్గీకరణ నివేదికలో లోపాలు

● మంద కృష్ణమాదిగ

పంజాగుట్ట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏక సభ్య కమిషన్ విచారణ శాస్త్రీయంగా జరగలేదని, లోపాలు సరిదిద్దుకోవడానికి కమిషన్‌కు మరో పది రోజులు గడువు ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ సూచించారు. లోపాలతో కూడిన నివేదికను అసెంబ్లీలో ఆమోదించారని విమర్శించారు. వీరశైవ కక్కయ్య డోర్ సమాజ్ ఆధ్వర్యంలో సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగలు, డోర్ కులం వేర్వేరు అయినా తమ కులవృత్తి ఒక్కటేనని, అత్యంత వెనుకబడిన డోర్ కులాన్ని గ్రూపు-2లో తమతో కలపకుండా అభివృద్ధి చెందిన కులాలు ఉన్న గ్రూపు-3లో కలపడం దారుణమన్నారు. జస్టిస్ షమీమ్ అక్తర్ ఇచ్చిన నివేదికలోని అంశాలను సబ్ కమిటీ అధ్యయనం చేసిందా లేదా అని ఆయన ప్రశ్నించారు. ఈ నివేదికతో కొన్ని కులాలకు అన్యాయం జరుగుతోందన్నారు. ఈ నెల 7న తాము తలపెట్టిన లక్ష డప్పులు, వేల గొంతులు కార్యక్రమాన్ని అడ్డుకోవడానికే రాష్ట్ర ప్రభుత్వం అశాస్త్రీయంగా జరిగిన వర్గీకరణను అసెంబ్లీలో ఆమోదించిందని ఆరోపించారు. దళితులలో ఏ కులాన్ని ఏ గ్రూపులో చేర్చాలి, ఏ కులానికి ఎంత శాతం రిజర్వేషన్ కేటాయించాలనే విషయంలో కమిషన్ విచారణ శాస్త్రీయంగా జరగలేదని విమర్శించారు. పొరపాట్లను సరి చేయడానికి కమిషన్‌కు మరో పది రోజుల సమయం ఇవ్వాలని, ఆయన నివేదిక ఇచ్చిన తరువాత ఎస్సీ వర్గీకరణ సబ్ కమిటీ 48 గంటలు అధ్యయనం చేసి లోపాలు ఏమైనా ఉంటే సరి చేసి క్యాబినెట్‌కు పంపించాలని సూచించారు. వెనుకబడిన వారిని దోచుకోవడానికి అభివృద్ధి చెందిన కులాలను గ్రూపు-1లో చేర్చారన్నారు.

ఒకే వేదికపై కాంగ్రెస్, బీజేపీ నేతలు

● పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా గతంలో ఒకరిపై ఒకరు ఆరోపణలు

● అభివృద్ధి కార్యక్రమంలో ఆప్యాయంగా పలకరింపులు



కార్యక్రమంలో పాల్గొన్న శ్రీగణేష్, రామకృష్ణ, కేశవరెడ్డి తదితరులు

ఆ నేతల మధ్య రాజకీయ వైరం ఉంది. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌లో చేరి ఒకరు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. మిగతా ముగ్గురు బీజేపీలో ఉన్నారు. వీరి మధ్య పచ్చ గడ్డి వేస్తే భగ్గుమనేలా రాజకీయ విభేదాలు ఉన్నాయి. కానీ అభివృద్ధి కార్యక్రమం కావడంతో భేషజాలకు పోకుండా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. సోమవారం 6వ వార్డులోని టెంపుల్ రాక్ ఎన్‌క్లేవ్‌లో ఆ నలుగురు ఒక వేదికపై చేరారు.

సికింద్రాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): భూగర్భ డ్రైనేజీ పనుల శంకుస్థాపన కార్యక్రమం కాంగ్రెస్, బీజేపీ నేతలను ఒక చోటుకు చేర్చింది. ఎన్నికల తర్వాత అంతా కలిసి అభివృద్ధి పనులకు సహకరించుకోవాల్సిందేనని చేసిన వ్యాఖ్యలు చేసి అందరినీ అబ్బురపరచారు. విషయానికొస్తే... సికింద్రాబాద్ కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్ రాజకీయ ప్రస్థానం కాంగ్రెస్‌లో ప్రారంభించారు. ఆ తర్వాత రాజకీయ పరిణామాల నేపథ్యంలో బీఆర్ఎస్, బీజేపీలలో చేరి గత ఎన్నికల్లో సొంతగూటికి చేరారు. ఉప ఎన్నికల్లో కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. ప్రస్తుతం సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడిగా కొనసాగుతున్న జే.రామకృష్ణ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా, కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యుడిగా కొనసాగుతున్నారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ పాలక మండలి మాజీ ఉపాధ్యక్షుడు సాద కేశవరెడ్డి బీజేపీలో కొనసాగుతున్నారు. అలాగే సికింద్రాబాద్ కంటోన్మెంట్ పాలక మండలి మాజీ ఉపాధ్యక్షురాలు బాణుక నర్మద ఆమె భర్త బాణుక మల్లికార్జున్‌లు బీజేపీలో ఉన్నారు. పార్టీ రాష్ట్ర ఓబీసీ సెల్ నాయకుడిగా బాణుక మల్లికార్జున్ ఉన్నారు. అయితే ఎన్.శ్రీగణేష్, సాద కేశవరెడ్డి, రామకృష్ణ-బాణుక మల్లికార్జున్‌లు కలిసిమెలిసి ఉన్నారు.

ఈక్రమంలో ఎన్.శ్రీగణేష్ ఉన్నట్టుండి బీజేపీకి గుడ్‌బై చెప్పి కాంగ్రెస్‌లో చేరి కంటోన్మెంట్ శాసనసభ్యుడిగా ఎన్నిక కావడం చకచకా జరిగిపోయాయి. జె.రామకృష్ణ వైఖరి కారణంగానే పార్టీ వీడాల్సి వచ్చిందంటూ ఎన్నో సందర్భాల్లో బాహాటంగా ఆయన తెలిపారు. ఇక రామకృష్ణకు, ఆయనకు మధ్య తరచూ రాజకీయ వైరం కొనసాగుతోంది. మరోవైపు సాద కేశవరెడ్డి-రామకృష్ణల మధ్య కూడా పలు మార్లు రాజకీయ విమర్శలు, వ్యక్తిగత ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటున్నారు. వీరిద్దరూ బీజేపీలోనే ఉన్నా పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే రీతిలో వైరం సాగుతోంది. అంతకుముందు కలిసిమెలిసి పార్టీ కార్యక్రమాలు నిర్వహించిన వారు ప్రస్తుతం రాజకీయ శత్రువులుగా కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో వీరంతా భూగర్భ డ్రైనేజీ పనుల శంకుస్థాపనకు హాజరు కావడం చర్చనీయాంశమైంది.

రామకృష్ణ సహకారంతోనే ఎమ్మెల్యే అయ్యా : శ్రీగణేష్

బోయిన్‌పల్లి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): బోర్డు సభ్యుడు రామకృష్ణ సహకారంతోనే కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా తాను గెలుపొందానని శ్రీగణేష్ అన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గం 6వ వార్డు టెంపుల్‌రాక్ ఎన్‌క్లేవ్ కాలనీలో బీజేపీ నాయకులు, బోర్డు మాజీ ఉపాధ్యక్షురాలు బానుక నర్మదమల్లికార్జున్ ఆధ్వర్యంలో రూ.37.6 లక్షలతో నిర్మిస్తున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పైపులైన్ పనులకు సోమవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతంలో ఈ ప్రాంతానికి ఎంపీగా పనిచేశారని, దీంతో ఆయనకు ఈ నియోజకవర్గంపై పూర్తిగా అవగాహన ఉందన్నారు. అందుకే కంటోన్మెంట్ నియోజకవర్గ అభివృద్ధి కోసం సీఎం పూర్తిస్థాయిలో సహకారం అందిస్తున్నారని అన్నారు. తాను అన్ని శాఖల మంత్రులతో సమన్వయం చేసుకుంటూ నిధులు తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నానని చెప్పారు. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం కోసం సేకరిస్తున్న రక్షణశాఖ భూములకు ప్రత్యామ్నాయంగా ఇస్తున్న రూ.303 కోట్లను కూడా సెంట్రల్ ఫండ్‌కి కాకుండా కంటోన్మెంట్‌కి కేటాయించేలా సీఎం రక్షణశాఖతో మాట్లాడారని అన్నారు. ఎన్నికల సమయంలో పార్టీల పరంగా ఆరోపణలు చేసుకున్నా ప్రజలు అధికారం ఇచ్చినప్పుడు పార్టీలకు అతీతంగా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు నామినేట్ సభ్యు డు జన్యావుల రామకృష్ణ, మాజీ మంత్రి వేణుగోపాలచారి, బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు సదా కేశవరెడ్డి, బోర్డు అధికారులు ఫణికుమార్, కాలనీ అధ్యక్షులు మురుగేశన్, స్థానిక కాంగ్రెస్ నాయకుడు బద్దం బల్వంత్‌రెడ్డి, బీజేపీ నాయకులు అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిపై ఆరోపణలు సరికాదు

● బోయినపల్లి మార్కెట్ వైస్ చైర్మన్ దేవేందర్



సమావేశంలో మాట్లాడుతున్న దేవేందర్, ఆనంద్ బాబు

మారేడుపల్లి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ బోర్డు అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం లేదంటూ బోర్డు నామినేటెడ్ సభ్యుడు జె.రామకృష్ణ సీఎం రేవంత్‌రెడ్డిపై ఆరోపణలు చేయడం మానుకోవాలని బోయినపల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ డీబీ దేవేందర్ అన్నారు. సోమవారం పికెట్ లక్ష్మీనగర్‌లోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి టీపీటీ చార్జీ నిధులు కంటోన్మెంట్ బోర్డుకు రాకపోవడంతో కోర్టును ఆశ్రయించి రాబట్టామని రామకృష్ణ చెప్పుకోవడం మానుకోవాలని సూచించారు. రక్షణ శాఖ నుంచి కంటోన్మెంట్‌కు రావాల్సిన బకాయిలు రాబట్టే విషయంలో బీజేపీ అధినాయకులు అశ్రద్ధ చూపుతున్నారని ఆరోపించారు. రక్షణ శాఖ నుంచి సర్వీస్ ట్యాక్స్‌ల కింద 700 కోట్ల రూపాయలు రావాలని, వాటిని రాబట్టే విషయంపై కోర్టును ఆశ్రయిస్తామని చెప్పారు. కంటోన్మెంట్ బోర్డు అభివృద్ధిపై ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బోయినపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌బాబు, డైరెక్టర్లు యాజాస్ సన, అస్లాం సోఫీ, ఎస్.రాజేందర్, ఆకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాంధీ ఆస్పత్రిలో విద్యార్థులకు కంటి పరీక్షలు



విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న ప్రొఫెసర్ రవిశేఖర్

అడ్డగుట్ట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి కంటి పరీక్షలు చేయించుకోవాలని గాంధీ ఆస్పత్రి నేత్ర వైద్య విభాగాధిపతి ప్రొఫెసర్ రవిశేఖర్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం స్కూల్ విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించే కార్యక్రమాన్ని గాంధీలో మొదటి రోజు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు రెటీనా, మెల్లకన్ను పరీక్షలు చేశామన్నారు. ఈ కార్యక్రమం మార్చి 6 వరకు నిర్వహిస్తామన్నారు. నేత్ర వైద్యులు భైరి సుజని, ప్రావీణ్య, సిబ్బంది పాల్గొన్నారు.

స్కిల్ ల్యాబ్ ప్రారంభం..

గాంధీ ఆస్పత్రిలో జనరల్ సర్జరీ విభాగంలో స్కిల్ ల్యాబ్‌ను గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజకుమారి చేతుల మీదుగా ప్రారంభించారు. వైద్య విద్యార్థులు స్కిల్ డెవలప్‌మెంట్‌పై శిక్షణ తీసుకునేందుకు ల్యాబ్‌ను ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. గాంధీ డిప్యూటీ సూపరింటెండెంట్ ప్రొ. సునీల్‌కుమార్ పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ సామల హేమ



బౌద్ధనగర్‌లో మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ కంది శైలజ

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు



మొక్కలు నాటుతున్న గజ్జెల నాగేష్

సికింద్రాబాద్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నాగేష్ ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను సోమవారం సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో ఘనంగా నిర్వహించారు. తాడ్‌బండ హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మొక్కలు నాటారు. కార్ఖానాలోని మదర్ థెరిస్సా ఆశ్రమంలో మెడికల్ కిట్స్, దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ నాయకులు సత్యనారాయణగౌడ్, రావుల సతీష్, నిత్య, విశ్వనాథం, గంగారామ్, శివయాదవ్, నరహరి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీతాఫల్‌మండి, బౌద్ధనగర్‌లో..

బౌద్ధనగర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జన్మదిన వేడుకలు సోమవారం సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ డివిజన్‌లలోని పలు ప్రాంతాల్లో ఘనంగా జరిగాయి. సీతాఫల్‌మండి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్థానిక కార్పొరేటర్ సామల హేమ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. అనంతరం నామాలగుండు కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గడ్డం అశోక్, రవి, నవీన్, సతీష్, లలిత, విజయ తదితరులు పాల్గొన్నారు. బౌద్ధనగర్‌లో కనకదుర్గ ఆలయం వద్ద కార్పొరేటర్ కంది శైలజ కేక్ కట్ చేశారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కంది నారాయణ, నాయకులు బెజ్జంకి రాజేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

ఇల్లు ఖాళీ చేసే విషయంలో గొడవ.. కేసు నమోదు

బోయిన్‌పల్లి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని సంజీవయ్యనగర్ కాలనీలో ఆదివారం అద్దెకు ఇచ్చిన ఇంటి కిరాయి చెల్లించడంలేదని, ఇల్లు ఖాళీ చేయించే విషయంలో జరిగిన గొడవలో పోలీసులు ఇరువర్గాలపై కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీలోని ఇంటి యజమాని ప్రభుకుమార్ గౌడ్ గత రెండు సంవత్సరాల క్రితం కింది పోర్షన్‌ను నలుగురు కుటుంబ సభ్యులకు కిరాయికి ఇచ్చాడు. ఇల్లు ఖాళీ చేసే విషయమై యజమానికి, కిరాయిదారుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఆదివారం ఘర్షణ జరిగింది. కాగా ఇరువర్గాలు బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. ఇరువర్గాల ఫిర్యాదులను స్వీకరించిన ఎస్ఐ కల్పన కేసు నమోదు చేశారు. సీఐ లక్ష్మీనారాయణరెడ్డి, ఎస్ఐ నాగేంద్రబాబు, కానిస్టేబుల్ శోభ సంఘటన స్థలానికి వెళ్లి సోమవారం విచారణ జరిపారు. ఆదివారం జరిగిన సంఘటనపై చుట్టుపక్కల వారిని విచారించి తుది నివేదిక తయారుచేసి ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు పోలీసులు తెలిపారు.

ఐటీ సెల్ కానిస్టేబుల్ ఆత్మహత్య

రాంగోపాల్‌పేట్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న పోలీస్ శాఖ ఐటీ సెల్‌లో పనిచేసే కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్న ఘటన మహంకాళి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మహంకాళి ఇన్‌స్పెక్టర్ పరశురామ్ తెలిపిన వివరాల ప్రకారం.. గాజుల రఘునాథరావు (36) హైదరాబాద్ సిటీ పోలీస్ ఐటీ విభాగంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. 2022 నుంచి రఘునాథరావు అనారోగ్య సమస్యతో బాధపడుతూ 2023లో శస్త్ర చికిత్స చేయించుకుని మందులు వాడుతున్నాడు. ఆదివారం అతని భార్య గాజుల దాక్షాయిని బోయినపల్లిలోని తన పుట్టింటికి వెళ్లి రాత్రి 7.30కి తిరిగి వచ్చింది. ఇంటికి వచ్చిన దాక్షాయిని రెండవ అంతస్తులోని తన గదికి వెళ్లి చూడగా ఉరేసుకుని కనిపించాడు. వెంటనే కింద పోర్షన్‌లో ఉండే కుటుంబ సభ్యులకు చెప్పడంతో 108కు కాల్ చేశారు. సిబ్బంది వచ్చి అప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు. దాక్షాయిని ఫిర్యాదు మేరకు జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నట్లు కేసు నమోదు చేశారు.



సికింద్రాబాద్ పార్క్‌లేన్ వద్ద డ్రైనేజీ ఓవర్ ఫ్లో అవుతుండటంతో యంత్రంతో నాలాలోని సిల్ట్‌ను తీయిస్తున్న బీజేపీ నేత విష్ణు. - రాంగోపాల్‌పేట్, ఆంధ్రజ్యోతి

వేగంగా రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు

● రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్



రైల్వే స్టేషన్‌ను సందర్శించిన రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ ఎయిర్‌పోర్టు తరహాలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులు ఈ ఏడాదిలోగా పూర్తి చేస్తామని సికింద్రాబాద్ రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ తెలిపారు. సోమవారం రాత్రి రైల్వే జీఎంతో పాటు రైల్వే ఉన్నతాధికారులు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను సందర్శించారు. నిర్మాణ పనులు ఎలా జరుగుతున్నాయనే విషయంపై రైల్వే అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్లాట్ ఫాంలను సందర్శించి రైల్వే స్టేషన్ నమూనా డ్రాఫ్టులను పరిశీలించారు. ఈ సందర్భంగా రైల్వే జీఎం మాట్లాడుతూ. రైల్వే స్టేషన్‌లో పనులను పరిశీలించేందుకు వచ్చానని, ఏడాదిలోగా నిర్మాణ పనులు పూర్తికానున్నట్లు తెలిపారు. రూ.700 కోట్ల వ్యయంతో పనులు చురుకుగా సాగుతున్నాయన్నారు. రైల్వే డీఆర్ఎం భర్తేష్ కుమార్ జైన్, వివిధ విభాగాలకు చెందిన రైల్వే అధికారులు పాల్గొన్నారు.

'నుమాయిష్' ఆదాయంతో విద్యావ్యాప్తి

● ప్రభుత్వ తరపున సహకరిస్తాం ● మంత్రి ప్రభాకర్ స్పష్టీకరణ

● ముగింపు ఉత్సవాలకు హాజరైన పొన్నం



జ్ఞాపికను అందజేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

అఫ్జల్‌గంజ్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఏటా అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన నుమాయిష్ ద్వారా వస్తున్న ఆదాయాన్ని వెనకబడిన తెలంగాణ ప్రాంతాల్లో విద్యాసంస్థలు నెలకొల్పి, విద్యావ్యాప్తికి కృషి చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఎగ్జిబిషన్ సొసైటీ చేస్తున్న కృషిని కొనియాడారు. సోమవారం రాత్రి నాంపల్లిలోని ఎగ్జిబిషన్ మైదానంలో గాంధీ సెంటనెరీ హాల్ వేదికగా 84వ అఖిలభారత పారిశ్రామిక ప్రదర్శన-2025 నుమాయిష్ ముగింపు ఉత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 46 రోజుల పాటు నిరవధికంగా నుమాయిష్ ఎలాంటి ఇబ్బందులు, అవరోధాలు లేకుండా ప్రశాంతంగా ముగిసిందన్నారు. అందుకు కృషి చేసిన సొసైటీ వర్గాలను ప్రత్యేకంగా అభినందించారు. యేటా నిర్వహణ ద్వారా వచ్చే ఆదాయాన్ని సామాజిక సేవా కార్యక్రమం కింద విద్యాసంస్థలు స్థాపించి విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేస్తున్నారన్నారు. ఇక ప్రభుత్వపరంగా కూడా సహకరిస్తామని భరోసా ఇచ్చారు. దేశ, విదేశాల్లో మున్ముందు మరింత ఆదరణ పొందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈసారి దేశ, విదేశాల నుంచి లక్షల మంది సందర్శకులు వచ్చారన్నారు. అనంతరం ఉత్తమ స్టాళ్ల యజమానులు, అధికారులు, ఇతరులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు ఎం. అనిల్‌కుమార్ యాదవ్, రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ శివసేనారెడ్డి, తెలంగాణ మైనారిటీస్ గురుకులాల విద్యాసంస్థల సొసైటీ చైర్మన్ ఫయిమ్ ఖురేషి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతినిధులు నిరంజన్, సురేందర్ రెడ్డి, డి. మోహన్, ప్రభాశంకర్, రవీయాదవ్ పలువురు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
ఎం.డి. రఫీక్ : 99854 00084, జి.అంజయ్య: 9985921364